


విజయవాడ స్టేషన్‌లో మెయిలు కూత వేసింది. కాఫీలు సగం తాగి, హెగిన్ బాదమ్స్ బుక్‌స్టాలులో కావలసిన పుస్తకాల కోసం సగం పుస్తకాలు మాత్రమే చూసి, హడావిడిగా బండెక్కుతున్నారు ప్రయాణీకులు. జాగా దొరకని ప్రయాణీకులు చివరిదాకా ప్రయత్నించి, తలుపుల కమ్ములు పట్టుకొని నిల్చున్నారు

డీజిల్ ఇంజన్‌తో ఉన్న మెయిల్ కదిలింది।

అవతల ప్లాటుఫారం మీద నుండి వచ్చిన భార్యాభర్తలు దొరికిన రెండవ కంపార్టుమెంటులోకి ఎక్కారు.

అనామిక

వాళ్ళు ఎక్కింది ఫస్టుక్లాసు కంపార్టుమెంటు।

వాళ్ళు కొన్న టికెట్లు సెకెండు క్లాసువి

"ఫస్టు....క్లాసులో- ఎక్కామంటి.... మ....మనం" అన్నది భార్యరొప్పుతూ.

"అవును. ఇంతకన్నా గత్యంతరం లేదు వాణీ।" అన్నాడు కొంచెం ఆయాస పడుతున్న భార్యను పరిశీలిస్తూ.

"ఎవరైనా ఏమన్నా అనరా?"

"టి.టి ఐ లు తప్పితే ఎవరూ ఏమనరు సాధారణంగా. అదుగో అక్కడ ఖాళీగా ఉందిగా కూర్చో....భయమేమిటి దొంగతనమా ఏమన్నానా? కాదు కూడదంటే ఎక్సెస్ కడతాం" అన్నాడు వేణు

గోపాల్ ధీమాగా. ఆ కంపార్టుమెం టులో ఉన్న శ్రీమంతులు, ఉత్తర హిందూస్థానం వాళ్ళు కాబోలు అతని మాటలు అర్థం కాక వాళ్ళ కబుర్ల కాల క్షేపాలలో మునిగిపోయారు.

రైలు కృష్ణానదిపైకి వచ్చింది. ప్రకాశం బ్యారేజిపైన వెలుగుతున్న లైట్ల కాంతి కృష్ణానదిలో కాంతిలతల్ని ఏర్ప రుస్తున్నది. రైలుబండి లయబద్ధంగా శబ్దం చేస్తూ సాగిపోతున్నది బ్రిడ్జిపైన

రైలు కృష్ణా కెనాల్ స్టేషన్ దాటింది వేణు కూర్చోకుండా తలుపు దగ్గర నిల బడే కిటికీలో నుంచి బైటకు చూస్తు న్నాడు.

రెండు మూడు గజాల దూరంలో చెకింగ్ చేస్తూ వస్తున్న టి.టి.ఐ. కన బడ్డాడు. భార్య కొంచెం ఆందోళనగా భర్త ముఖం చూసింది. భర్త తదేకంగా టి.టి.ఐ.నే చూస్తున్నాడు. టిటిఐవైపు చూస్తే, అతను కూడా ఎందుకో వేణు వైపు తీక్షణంగా చూస్తున్నట్లు గమనిం చింది. టిక్కెట్లపై సంతకాలు గీస్తున్న అతని ముఖంలో అకస్మాత్తుగా ఏవో స్మృతి కెరటాలు తాకినట్లుగా సంతోష ఛాయలు కనబడీ కనబడనట్లు మాయమై పోయాయి.

టిక్కెట్లు గబగబ చెక్ చేస్తూ తలుపు దగ్గర నుంచున్న వేణు దగ్గరకువచ్చాడు. వేణులో ఒక సంతోష తరంగం ఎగ సింది.

"టికెట్ ప్లీజ్" అన్నాడు.

"ఒరే! నువ్వు రాజువి కదూ! నేను. నేనురా ... మర్చిపోయావా? వేణు గోపాల్ను! పదిహేను సంవత్సరాలైం దిరా నిన్ను చూసి! గుడ్లవల్లేరు హైస్కూల్లో ఉద్యోగం....మా వూరే వెళ్తున్నాను....ఎంత కాలమైందిరా నిన్ను చూసి...." ఆనందంగా మాట్లాడు తున్నాడు వేణుగోపాల్ టి. టి. ఐ. భుజాలపై చేతులు వేసి కుదుపుతూ.

టిటిఐ కన్నులు మెరశాయి. అతను వేణుగోపాల్ కన్నుల్లోకి చూసి ఏదో గుర్తుతెచ్చుకొన్నట్లుగా ఆ కంపార్టు మెంటులో చివరిదాకా దృష్టి సారించాడు. ఎవరో తొంగి చూసినట్లనిపించింది అతను అకస్మాత్తుగా స్టిఫ్‌గా మారి పోయాడు.

"ఐయామ్ నాట్ రాజు....టికెట్ ప్లీజ్" అనగానే వేణుగోపాల్ చేతులు అతని భుజంమీదనుంచి అప్రయత్నంగా జారిపోయాయి. గుండెలో ఉవ్వెత్తుగా ఎగిరిపడ్డ ఆనంద తరంగం ఒక్క క్షణంలో అణిగిపోయింది!

"ఐయామ్ సారీ!" అని రెండు టిక్కెట్లు ఇచ్చాడు.


"రెండో టిక్కెట్టు ఎవరిది?"

"అదుగో నా భార్య!" కర్కశంగా సమాధానం ఇచ్చేడు. ఆమె వైపు చూశాడు టి.టి.ఐ.

"ఎందుకు ఎక్కారు ఫస్టు క్లాసు కంపార్టుమెంటులో సెకెండు క్లాసు టిక్కెట్లు కొని?"

"ఎక్కకూడదని మాకు తెలుసు! గత్యంతరం లేక ఎక్కాం. కానీ కన్నులు కప్పుదామనీ, మోసం చేద్దామనే ఉద్దే శంతో కాదు"

"మీ ఉద్దేశాలు....మీకుంటే మా ఉద్దే శాలు మాకుంటాయి రూల్స్ ప్రకారం




ఎక్కకూడదు అనిగదా అడుగుతున్నాను నేను"

"మీ రూల్సు వైలేట్ చేద్దామని కాదండి మా ఉద్దేశం! విజయవాడ స్టేషన్లో బండి కదిలింది. ఇంకో కంపార్టుమెంటు చూసే వ్యవధి లేకపోయింది .. దానికి తోడు నా భార్య నిండుమనిషి అందుకనే అందిన కంపార్టుమెంటులో ఎక్కాం. మీరు మానవతా దృష్టితో ఆలోచించాలి. ముందు వెనుకలు ఆలోచించాలి!"

ఈ మాట వేణు గోపాల్ అనగానే అతని కన్నుల్లోకి చూచి ఆమె వైపు వంగి గౌరవ దృష్టితో చూశాడు.

"నేను ఆలోచించేది తర్వాత; ముందు మీరు ఎక్సెస్ కట్టాలి" అన్నాడు టి టి ఐ.

"ఓ.... యస్.... తప్పకుండా"

అప్పుడు టి టి. ఐ "సుబ్బారావు" అని పిలవగానే "సార్! వస్తున్నా" ఒక మనిషి సంచి పట్టుకొని వచ్చాడు. దానిలో నుంచి తీసి ఇచ్చాడు ఒక రసీదు పుస్తకం.

"డబ్బు తియ్యండి"

"ఊఁ" అని యాభై రూపాయలనోటు అందించాడు వేణుగోపాల్ దురుసుగా.

పెదవులపై నవ్వుకొన్నాడు టి.టి.ఐ వేణుగోపాల్ వైపు చూడకుండా.

పెద్దవడ్లపూడి స్టేషన్ దాటింది రైలు బ.డి.

"దయచేసి ఇక్కడే కూర్చోండి.... ఎందుకు నిలబడ్డారు? మా ఆర్డర్లీతో మిగతా డబ్బు, రసీదులు పంపుతాను" అని వేణుగోపాల్ను భుజంతట్టి భార్య ఎదురుగా సీటు చూపించాడు. వేణు గోపాల్ ఎర్రగా అతని కన్నుల్లోకి చూస్తే, అతను ముఖం తప్పించు కొన్నాడు కూర్చున్నభర్త ముఖాన్నిభార్య పరికించింది. కోపం. అసహనం, అసం

దిగ్గత భర్త ముఖంలో తెరలు తెరలుగా కనబడుతున్నది.

వేణుగోపాల్ తలలో గతం గిర్రున తిరిగింది।

వీడు రాజులాగే ఉన్నాడు । లాగే ఏమిటి? రాజే: కాదంటాడే। నేను పోలి కల్పిబట్టి భ్రమపడ్డానా? ఆహాఁ — అబ్బే! ఆరోజులు.... గుంటూరులో బి. ఏ. చదువుతున్న రోజులు.... తాను. రూమ్‌మేట్ రాజు ఎప్పుడూ జంటే। సినీమాలు, షికార్లు, సభలు, సమావేశాలు, చర్చలు- అన్ని చోట్లకు మిత్ర ద్వయం హాజరు కావలసిందే। ఎట్లా మరచిపోడం।

ఇద్దరిలో ఆనాడు జీవితాన్ని గురించి ఎంత బెంగ। బ్రతుకు సజావుగా బ్రతకడానికి ఎన్ని సవాళ్ళు ఎదుర్కోవాలి? ఎన్ని అడ్డంకులు తొలగించుకోవాలి? అప్పుడు ఎన్నో మొలకెత్తే ప్రశ్నలు।

"ఉద్యోగం రావడం సమస్యే? వచ్చిన జీవితాన్ని నిబ్బరంగా నిర్వర్తించడం సమస్యే।" అని వేణుగోపాల్ అంటే,

"డ్యూటీ ఈజ్ వర్‌షిప్పురా। ఉద్యోగాన్ని సవ్యంగా నిర్వర్తించనినాడు ఆత్మ వంచన।" అనేవాడు రాజు.

"హరి కథలు కాదోయ్" అని వేణుగోపాల్ నవ్వు.

"చూద్దాంగా" అని రాజు సమాధానం.

ఇటువంటి వాదోపవాదాలు తీసివేస్తే, హృదయాన్ని సన్నిహితం చేసే సంఘటనలు ఇంకా ఎన్నో।

"నేను మాత్రం ఆంధ్రాలో ఉద్యోగం చేయనురా" అని రాజు అంటుండేవాడు.

"ఆంధ్రాలో కాకపోతే అండమాన్సులో చెయ్యరా— ప్రతి వాడికి ఇదో తంతు అయ్యింది ఇప్పుడు" అని రాజు.

"చూస్తావుగా నువ్వే।"

"అవునురా స్నేహాలకు దూరంగా పారిపోదామని కదూ" అని వేణుగోపాల్ రెట్టించేవాడు.

"అందుకు మాత్రంకాదు; ఎక్కడున్నా నిజమైన స్నేహం వెంటాడే మధురమైన కల"

"అదీ చూద్దాంగా।"

ఇటువంటి తీయని జ్ఞాపకాలు మనసును మధిస్తే, అతని కన్నులు చెమ్మగిల్లినై. ఇప్పుడు రాజులాగే ఉండి మోటుగా ప్రవర్తిస్తున్న టి టి. ఐ మీద కోపం వచ్చింది. ఆనాడు ఆవిధంగా అని, ఇప్పుడు ఇట్లా ప్రవర్తిస్తాడే? అప్సర్డ్। రాజు అయితే ఇట్లా మాట్లాడతాడా? ఇట్లాగే వాడు గనక ప్రవర్తిస్తేనా, పళ్ళు రాల గొట్టి ఉందును ఎక్కడున్నాడో నా మిత్రుడు।?

ఈ ఆలోచనలతో వేణుగోపాల్ కుసీ పడుతుండగా మెయిలు తెనాలి స్టేషన్‌లోకి వచ్చేసింది.

"ఏమండీ। మనం దిగాలి...."

"ఆఁ.... అప్పుడే తెనాలి వచ్చిందా?" అని లేచి నుంచున్నాడు.

అంతలో టి.టి.ఐ వస్తూ "మా ఆర్డర్లీ/ చిల్లర మార్చి మీకిస్తాడు — ఇదిగో టిక్కెట్సు.... విష్ యూ గుడ్ లక్" అన్నాడు.

అతని ముఖం చూడకుండా అందుకొన్నాడు వేణుగోపాల్. బండిఆగింది. దిగారు. వేణుగోపాల్‌లో ఒక సారి

వెనక్కి తిరిగితే టి.టి.ఐ. డోరు దగ్గర నిలబడి అతణ్ణే చూస్తున్నాడు, ఇంకా ఎవరితోనో మాట్లాడుతూ ప్రతి కంపార్టుమెంటులో ఒక్కొక్క టి.టి.ఐ. కనబడుతున్నాడు. "ఓహో! స్పెషల్ చెకింగ్ స్క్వాడ్ ఉందన్న మాట!" అనుకొన్నాడు వేణుగోపాల్.

హిగిన్ బాదమ్స్ బుక్ స్టాల్ దగ్గరకు వెళ్ళేటప్పటికి ఆర్డర్లీ పండ్ల బుట్ట వేణుగోపాల్‌కు అందించి, నమస్కారం చేసి, ఒక కవరు చేతికిచ్చి, వెళ్ళిపోయాడు.

భార్యాభర్తలు ఒకరి మొఖా లొకరు చూసుకున్నారు. లోపల ఉత్తరంతో పాటు, ఏభయి రూపాయల కాగితం ఉన్నది.

మై డియర్ వేణు!

సారీ! రాజునేరా! మెయిల్ స్పీడులా నా గుండె ఎంత స్పందించిందో! ఆ కంపార్టుమెంటులోనే స్పెషల్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ వున్నాడు. అందుకే మనస్సును రిస్ట్రెయిన్ చేసుకొన్నాను. వానికి తోడు జ్ఞాపకం వుందా? డ్యూటీ ఈజ్ వర్షిప్ అని నేనుఅంటే నీ 'మొహం' అనే వాడివి. ఎవరు గెల్చారు? గెలుపు సంగతి తర్వాత. ఎక్కడెక్కడో తిరిగాను నా మాట ప్రకారం! విధి చివరకు నన్ను స్వస్థానానికి నెట్టింది. వివరాలు ముఖా ముఖిగా మాట్లాడుకొందాం.... మీ ఊరు వస్తాను రెండు రోజుల్లో. జాగర్లమూడి కదూ! నా సోదరి(నీభార్య) నన్ను ఏమనుకున్నదో. నా వైఖరి గమస్తూనే వున్నది! ఎన్నో! ఎన్నో అనంతమైన ఆలోచనలు, నీతో మాట్లాడాలి. ఎక్సెసు నేనే కట్టాను. నన్ను గురించి చెప్పినందుకు అది నాకే ఫైన్. స్నేహం వెంటాడే తీయని కల అంటాను ఇప్పటికీ! ఎప్పటికీ! నన్ను మనస్సులో తిట్టుకొని ఉంటావులే! ఫర్వాలేదు! పెన్ సాగడంలేదు నిన్ను చూసిన తర్వాత బండి కుదుపులు. గుండెలో కదలికలు. సోదరికి దీవెనలు.

నిన్ను కలుసుకోబోతున్న ఆనందంతో మునిగిన,

నీ రాజు

ఒక్క చూపులో ఉత్తరాన్ని చదివి "అరె, వెధవ! వాడేనే రాజు! ఒక్క నిముషం ఆగు" అని వేణుగోపాల్ పరుగెత్తాడు. అప్పటికే మెయిలు కదిలింది. పరుగెత్తాడు. కంపార్టుమెంటు డోరు దగ్గర నిలబడి చూస్తున్న రాజు చెయ్యి ఊపాడు. వేణుగోపాల్ ఆగిపోయిచెయ్యి ఊపాడు మెయిలు స్పీడు అందుకొన్నది. చివరి కంపార్టుమెంటు వెనక వున్న ఎర్రని దీపం గుండెలోని అనురాగంలా మెరసింది.

